

పోలీసుల తనిఖీలు

వికారాబాద్, ఏప్రిల్10: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. బుధవారం ఆర్టీసీబస్టాండ్, రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా టీంలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.





ఘట్‌కేసర్ మున్సిపాలిటీ శివారెడ్డిగూడ ఈద్గాలో ఏర్పాటు చేసిన షామియానా



బొంరాస్‌పేట్‌లో విద్యుత్ వెలుగుల్లో మసీదు



మేడ్చల్ మార్కెట్‌లో పండుగ సామగ్రి కొనుగోళ్లు

నేడు ఈద్ ఉల్ ఫితర్

- రంజాన్ పండుగకు ఈద్గాలు, మసీదులు ముస్తాబు
- ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి

వికారాబాద్/మేడ్చల్‌టౌన్, ఏప్రిల్ 10 : నేడు రంజాన్ పండుగను పురస్కరించుకుని వికారాబాద్, మేడ్చల్ జిల్లాలోని ఈద్గాలు ముస్తాబయ్యాయి. పండుగ నేపథ్యంలో ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మసీదులు, ఈద్గాలను శుభ్రం చేయించి రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రార్థనా మందిరాల వద్ద నిర్వాహకులు షామియానాలు ఏర్పాటు చేశారు.మేడ్చల్ పట్టణం, అత్వేల్లిలోని ఈద్గాలను శుభ్రం చేయించారు. ముకుంద్ థియేటర్ వద్ద ఈద్గాను మసీదుకు నిర్వాహకులు రంగులు వేయించి మున్సిపల్ సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు. మేడ్చల్ పట్టణంలో ముస్లింలు అత్యధికంగా ఉన్నందున అందరు ఒకే సమయంలో ఒకేచోట ప్రార్ధనలు చేసే వీలు లేకపోవటంతో ప్రార్ధనలుచే చేసుకునేందుకు సమయాన్ని మార్చారు. రంజాన్ పండుగ సందర్భంగా అవసరపడే వస్తువులు ఇతర వంట సామగ్రి కొనుగోలుకు ముస్లింలు పెద్ద ఎత్తున మేడ్చల్ మార్కెట్‌కు రావటంతో దుకాణాలు కిటకిటలాడాయి. మసీదులు, ఈద్గాల వద్ద మేడ్చల్ పోలీసులు ప్రత్యేకంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. వికారాబాద్ జిల్లా తాండూరు, వికారాబాద్, పరిగిలో, కొడంగల్ లలో ఈద్గాలు, మసీదులను విద్యుత్ లైట్లతో అలంకరించారు.



అవసరం ఉన్నచోట కొత్తగా బోర్లు, పైపులైన్లు


- తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు
- పలు కాలనీలను పర్యటించిన అధికారులు
- పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా చేయిస్తున్న కమిషనర్ వెంకటయ్య

పరిగి,ఏప్రిల్ 10: 'పరిగి పురపాలికలో తాగునీటి కష్టాలు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనం అధికారులను కదిలించింది. ఈ మేరకు పరిగి మునిసినల్ కమిషనర్ వెంకటయ్య తమ సిబ్బందితో బుధవారం మునిసిపల్ పరిధిలోని భవానినగర్, తిరుమలరెసిడెన్సీ, మైత్రీనగర్, సిద్ధాంతి కాలనీల్లో పర్యటించారు. వాస్తవంగా క్షేత్రస్థాయిలో తాగునీటి సమస్య ఉందని గుర్తించారు. కాలనీల్లో మహిళలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. భవానీ, తిరుమల, మైత్రీనగర్‌లకు ప్రత్యేకంగా ట్యాంకరును కేటాయిస్తున్నట్లు తెలిపారు. నీటిని వృథా చేసుకోకుండా వాడుకోవాలని సూచించారు. తిరుమల రెసిడెన్సీలో కొత్తగా బోరు కూడా వేస్తామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ప్రాంతం నుంచి పైపులైన్ వేసి రెండు, మూడు రోజుల్లో నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నిధుల కొరత లేదని, ఏ కాలనీలోనైనా బోర్లు, పైపులైను వేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తిరుమల రెసిడెన్సీకి కొత్తగా వాటర్ ట్యాంకు నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ ఇంట్రా ప్రతినిధి మైపాల్, మునిసిపల్ సిబ్బంది మహేందర్‌రెడ్డి, రాజు, వాటర్‌మెన్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న సీఎస్ శాంతకుమారి

విజిలెన్స్ డీజీ రాజీవ్‌రతన్‌కు నివాళి

- శ్రద్ధాంజలి ఘటించిన మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్, కలెక్టర్

మహేశ్వరం, ఏప్రిల్ 10 : తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ రాజీవ్‌రతన్ గుండెపోటుతో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని మండలంలోని తుమ్మలూరుపరిధి మ్యాక్ ప్రాజెక్టులోని నివాసంలో ఉంచగా బుధవారం రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతకుమారి, డీజీపీ రవిగుప్తా, రాచకొండ సీపీ తరుణ్ జోషి, ఏసీబీ డీజీపీ సీవీ.ఆనంద్, ఇంటెలిజెన్స్‌చీఫ్ శివధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాజీవ్‌రతన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతదేహాన్ని దహన సంస్కారాల కోసం హైదరాబాద్‌లోని మహాప్రస్థానానికి తరలించి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

చికెన్ @ 320

ట్రిపుల్ సెంచరీ దాటిన కోడిమాంసం



పెరుగుతున్న చికెన్ రేట్లు మాంసాహార ప్రియులకు షాకిస్తున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా తినే చికెన్ ధరలు రోజుల వ్యవధిలోనే కిలోకు వంద వరకు పెరగడంతో కోడి మాంసం పేదలకు అందకుండా పోతోంది. గత నెల 18న కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.208 ఉంటే ప్రస్తుతం రూ.320కి చేరింది. కోళ్ల ఉత్పత్తి తగ్గడం, రంజాన్ మాసం, పెళ్లిళ్లు ఇతర శుభ కార్యాల్లో వాడకం ఎక్కువై డిమాండ్ పెరిగింది. ఎండ కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ధర పెరిగింది. ఇదో రికార్డని చికెన్ వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే మరి కొన్ని రోజుల్లో కిలోపై మరో 50 రూపాయల వరకు పెరిగే ఆస్కారం ఉందని మార్కెట్ వర్గాలంటున్నాయి. పౌల్ట్రీ ఫారాల్లో ఉత్పత్తి పెరిగితేనే చికెన్ రేట్లు దిగివచ్చే అవకాశం ఉంది.

- మండుతున్న ఎండలు.. మృత్యువాతపడుతున్న కోళ్లు
- తగ్గుతున్న ఉత్పత్తి.. డిమాండ్‌ను అందుకోని సప్లయ్
- రోజురోజుకూ పెరుగుతున్న చికెన్ రేట్లు.. తగ్గిన గుడ్డు ధర
- సామాన్యులకు అందని నాటుకోళ్లు
- భారీ ధరలతో సామాన్యులు సతమతం

రంగారెడ్డిఅర్బన్/మేడ్చల్/వికారాబాద్ (ఆంధ్రజ్యోతి)

సాధారణంగా ఎండ కాలంలో చికెన్ ధరలు తగ్గుతాయి. కానీ ఈసారి కోడి మాంసం ధరల పెరుగుదల చికెన్ ప్రియులకు షాకిస్తున్నాయి. ఊహించని విధంగా పెరుగుతున్న ధరలు నాన్‌వెజ్ లవర్స్‌ను కలవరపెడుతున్నాయి. కిలో 320కి చేరింది. పెరిగిన ధరలతో పేదలు, సామాన్యులు చికెన్ కొనలేని పరిస్థితి ఏర్పడుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో మనుషులకే కాదు ఇతర జీవులకూ ఇబ్బందిగా మారుతోంది. బ్రాయిలర్ కోళ్లు, నాటుకోళ్లు ఎండ వేడిని తట్టుకోలేక ఎక్కడికక్కడ చనిపోతుండడంతో డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి లేక చికెన్ రేటు అమాంతం పెరుగుతోంది. గత నెల రోజులుగా రంజాన్ సీజన్ కూడా నడుస్తుండడంతో చికెన్ డిమాండ్ కూడా సాధారణం కంటే ఎక్కువే ఉంది. ఇదిలా ఉంటే ఎండల తీవ్రతకు కోడి పిల్లలు చనిపోతాయని కొందరు పౌల్ట్రీషెడ్ల నిర్వాహకులు ఈ రెండు మూడు నెలలు కోళ్ల పెంపకాన్ని నిలిపేస్తారు. ఎండకాలం సీజన్‌లో కనీసం రెండు బ్యాచ్‌ల కోళ్లను పెంచకుండా వదిలేస్తారు. సాధారణంగా సమ్మర్‌లోచికెన్ ధర తక్కువే ఉంటుందని, లాభాలు కూడా అంతంతే అని బ్యాచ్‌లు పెంచరు. కోడి పిల్లలు చనిపోతే పెట్టుబడి మీద పడుతుందనే కారణంతోనూ బ్యాచ్‌లు వదిలేస్తారు. అయితే ఈసారి అనూహ్యంగా ఉత్పత్తి బాగా పడిపోయి ధర పెరుగుతోంది. ఓ వైపు పెళ్లిళ్ల సీజన్, మరో వైపు రంజాన్ పండగ ఉండటంతో చికెన్‌కు డిమాండ్ పెరిగింది. అందుకు తగ్గట్టు ఉత్పత్తి లేకే కోడి మాంసం ధర కొండెక్కింది. ప్రస్తుతం కిలో చికెన్ ట్రిపుల్ సెంచరీ దాటింది. మార్చి 18న కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.208 ఉంటే.. నేడు రూ.320కి చేరింది. 22 రోజుల్లోనే కిలో చికెన్‌పై రూ.112 పెరిగింది. దీంతో రెండు కిలోలు కొనేవారు కిలో, అర కిలో, పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు.

పడిపోయిన గుడ్డు ధర

కొంత కాలంగా చుక్కలు చూపించిన కోడిగుడ్డు ధరలు ఉన్నంట్టుండి తగ్గాయి. ఈ నెల 5వ తేదీన 7రూపాయలున్న గుడ్డు ధర ప్రస్తుతం 5కు పడిపోయింది. ఒక గుడ్డు ధర పౌల్ట్రీలో 3.75రూపాయలుంటే అదే గుడ్డు హోల్‌సేల్‌కు వచ్చేసరికి 4రూపాయలకు అమ్ముతున్నారు. రీటైల్ మార్కెట్‌లో ఒక్కో గడ్డు రూ.5కు విక్రయిస్తున్నారు. ఐదు రోజుల్లోనే గుడ్డుపై 2రూపాయలు తగ్గింది. చికెన్ ధర పెరగడం.. గుడ్డు ధర తగ్గటం నాన్‌వెజ్ ప్రియులకు కొంత ఊరటనిచ్చింది. అయితే పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ప్రజలు గుడ్డు తినడం తగ్గిందని, అందుకే గుడ్డు రేటు తగ్గిందని ఎగ్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు.

ఎండకు కోడి పిల్లలు చనిపోతున్నాయి



ఎండ తీవ్రతకు కోడి పిల్లలు 20-30శాతం వరకు చనిపోతున్నాయి. వేసవిలో కోడి బరువు కూడా తక్కువే ఉంటుంది. సాధారణంగా ఒక్కోకోడి అమ్మకానికి వచ్చేసరికి 2.5కిలోల బరువు రావాలి. అయితే 2కిలోలే వస్తుంది. కోళ్ల పెంపకం ఖర్చు కూడా పెరిగింది. వాతావరణానికి తగ్గట్టుగా కోళ్లను పెంచాలి. వేసవిలో చల్లదనం కోసం కోసం షెడ్ల వద్ద స్ప్రింక్లర్లు, కూలర్లు ఏర్పాటు చేయాలి. షెడ్ల వద్ద వాతావరణాన్ని చల్లబర్చి కోళ్లు చనిపోకుండా కాపాడుకోవాలి. కరెంట్, నీరు అవసరం. ఏప్రిల్ 26 వరకు పెళ్లిళ్ల శుభకార్యాలున్నాయి. నెల రోజుల పాటు రంజాన్ మాసం నడిచింది. దీంతో చికెన్ డిమాండ్ పెరిగింది. సప్లయ్ తగ్గింది.

- పడాల ప్రభాకర్, పౌల్ట్రీ రైతు, ముడిమ్యాల, చేవెళ్ల మండలం

రికార్డు స్థాయిలో ధర!

రానున్న రోజుల్లో కోడి మాంసం ధర మరింత పెరిగే ఆస్కారం లేకపోలేదని వ్యాపారులు చెబుతున్నారు. మరో వారం వ్యవధిలో చికెన్ కిలోపై 50రూపాయల వరకు పెరిగే ఆస్కారం ఉందని, దీంతో ధర రూ.370 వరకు చేరుకుంటుందని చికెన్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. చికెన్ ధరలు ఇంత ఎక్కువ ఎన్నడూ లేవని, ముఖ్యంగా ఎండకాలంలో ఇంతమేర ధర పెరగడం రికార్డే అని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. కోళ్ల ఉత్పత్తి పెరిగితేనే ధర తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కాగా మేడ్చల్ జిల్లాలో కోళ్ల ఫారాలు తక్కువగా ఉండటంతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. చికెన్ ధరకు రవాణా ఖర్చులూ తోడై రేట్లు అమాంతం పెరుగుతున్నాయి. ఇదిలా ఉంటే నాటుకోడి కిలో రూ.550 వరకు విక్రయిస్తున్నారు. బ్రాయిలర్ ఉత్పత్తి తగ్గిన నేపథ్యంలో నాటుకోడి ధర సైతం మరింత పెరిగే అవకాశం ఉంది.

ఒక గుడ్డు ధర(రూపాయలు)

ఏప్రిల్	ఫాంరేట్	హోల్‌సేల్	రీటైల్
10	3.75	4	5
5	5.24	5.54	7

చికెన్ రేటు బాగా పెరిగింది



నాకు చికెన్ ఇష్టం. వారంలో కనీసం రెండు సార్లయినా చికెన్ తినేవాన్ని. కిలోపై వంద వరకు పెరిగింది. ఎండ కాలంలో ఎన్నడూ లేనంతగా చికెన్ రేటు పెరిగింది. అర కిలోతో సరిపెడుతున్నా.

- ఈర్లపల్లి మహేశ్, ఆస్పల్లిగూడ, షాబాద్

చికెన్ ధరల వివరాలు

తేదీ	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
ఏప్రిల్ నెలలో..		
10	290	320
06	265	300
05	243	276
03	241	272
02	226	256
మార్చిలో..		
30	219	248
28	216	244
27	213	241
26	206	233
22	199	225
21	196	222
20	188	213
19	185	210
18	183	208

ధరలు మండిపోతున్నాయి



మార్కెట్‌లో కూరగాయల ధరలతో పాటు మాంసం ధరలూ మండిపోతున్నాయి. కిలో మటన్‌కు గ్రామాల్లో రూ.820 వరకు, పట్టణ ప్రాంతాల్లో 880 దాకా అమ్ముతున్నారు. అంత ధర పెట్టి పేద, మధ్య తరగతి ప్రజలు మటన్ కొనలేరు. అలాంటి వారు చికెన్‌తో సరిపెట్టుకుందామనుకుంటే.. ఇప్పుడు చికెన్ ధర కూడా 320 దాటింది. దీంతో కిలో కొనేవాళ్లం అర కిలోతో సరిపెట్టుకుంటున్నాం.

- బంగారు మాణమ్మ, తుమ్మలపల్లి, చౌదరిగూడెం మండలం

రానున్న రోజుల్లో చికెన్‌రేటు మరింత పెరిగే అవకాశం



వారం రోజుల నుంచి చికెన్ ధర పెరుగుతోంది. ఈ నెల 2న విత్‌స్కిన్ కిలో చికెన్ రూ.226, స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.256 విక్రయించాం. ప్రస్తుతం స్కిన్‌తో కిలో రూ.280 విక్రయిస్తున్నాం. అలాగే స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.310 విక్రయిస్తున్నాం. రంజాన్, పెళ్లిళ్ల సీజన్ కావడంతో చికెన్ వాడకం బాగా పెరిగింది.

- యాదగిరిగౌడ్, చికెన్ సెంటర్ యజమాని, కందుకూరు



ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై

వీగిన అవిశ్వాసం

- ఫిర్యాదు చేసిన 12 మంది కౌన్సిలర్లు సమావేశానికి దూరం
- ఏడుగురు కౌన్సిలర్లతో విహార యాత్రలో చైర్‌పర్సన్
- ఎవరూ హాజరు కానందున వీగినట్లు ప్రకటించిన ఆర్డీవో

ఘట్‌కేసర్, ఏప్రిల్ 10 : ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్‌పై పెట్టిన అవిశ్వాస సమావేశానికి సభ్యులు హాజరు కాకపోవడంతో వీగిపోయింది. బుధవారం ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11నుంచి మధ్యాహ్నం1గంట వరకు కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రెండు గంటల పాటు నిరీక్షించినప్పటికీ ఒక్క కౌన్సిలరూ హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో మొత్తం 18 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ 6, ఒకరు ఇండిపెండెంట్, ఇందులో నుంచి 10మంది బీఆర్ఎస్, ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు మొత్తం 12 మంది చైర్ పర్సన్‌పై అవిశ్వాసం కోరూతూ గతనెల 16న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ ఏ ఒక్క కౌన్సిలర్ హాజరు కాకపోవడం విశేషం. అవిశ్వాసం కోరుతూ ఫిర్యాదు చేసిన కౌన్సిలర్లు ఎవరి అలోచనల్లో వారున్నారు. సమావేశానికి పోకుండా ఉండటమే మంచిదనే నిర్ణయంతో దూరంగా ఉన్నామని కొందరు కౌన్సిలర్లు వివరించారు.

అప్రమత్తమైన చైర్ పర్సన్..

కౌన్సిలర్ల అవిశ్వాస నోటీసుపై ఏమాత్రం పట్టించుకోనట్టుగా వ్యవహరించిన చైర్‌పర్సన్ అదును చూసి అవిశ్వాస తేదీ ఖరారు అయిన వెంటనే 7మంది కౌన్సిలర్లును తీసుకోని విహార యాత్రకు వెళ్లారు. అందులో నలుగురు కాంగ్రెస్, ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌తో కలిసి ఏడు మంది ఉన్నారు. అయితే చేసేదేమి లేక బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ మిగతా 12 మంది కౌన్సిలర్ల తరఫున అవిశ్వాసానికి దూరంగా ఉంటున్నట్లు ప్రకటన జారీ చేశారు. పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి సూచనల మేరకే అవిశ్వాసాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు.



వివరాలు తెలియజేస్తున్న కీసర ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి

బీఆర్ఎస్‌కు రాజీనామా



సొంత పార్టీ వారే నమ్మకద్రోహం చేస్తూ, వెన్ను పోట్లు పొడవటాన్ని జీర్ణించుకోలేక పార్టీని వీడుతున్నట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. బుధవారం లేఖను ఆపార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పంపించారు. బుధవారం అవిశ్వాసం ముగియగానే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తూన్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే మల్లారెడ్డి అండదండలతో మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ పల్గుల మాధవరెడ్డి కలిసి కొంత మంది కౌన్సిలర్ల చేత తనపై అవిశ్వాసం పెట్టించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై అవిశ్వాసం వీగిపోయేందుకు కృషి చేసిన అందరికీ రుణపడి ఉంటానన్నారు. గత శాసన సభ ఎన్నికల్లో ఎంతో కష్టపడి ఎమ్మెల్యే మల్లారెడ్డి గెలుపు కోసం రాత్రిపగలు పనిచేస్తే ఆయనే తనపై అవిశ్వాసం పెట్టించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఒకటిరెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందని చైర్‌పర్సన్ సన్నిహితులు వివరించారు.

పేదలకు అండగా బీజేపీ ప్రభుత్వం

కులకచర్ల, ఏప్రిల్ 10: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఉపాధి కూలీలకు రోజువారి వేతనం రూ.272 నుంచి రూ.300 వరకు పెంచిందన్నారు. ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మండలంలోని ఘనపూర్ గ్రామంలో ఉపాధి కూలీలు బుధవారం నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ మళ్లీ కేంద్రంలో అధికారంలోకి రావాలంటే చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్, పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు షైపాల్, మాజీ సర్పంచ్ విజయలక్ష్మీ గోపాల్‌గౌడ్, నాయకులు రామచంద్రయ్య, బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.


మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, కూలీలు

కాంగ్రెస్ పార్టీ.. మాదిగల ద్రోహి

● ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ

తాండూరు రూరల్, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ పార్టీ మాదిగల ద్రోహి అని, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను ఓడిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ ఆదేశాల మేరకు బుధవారం తాండూరులో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మల్లికార్జున్ మాట్లాడుతూ తెలంగాణలో 70 లక్షలకుపైగా జనాభా ఉన్న మాదిగలకు పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఒక్కస్థానం కూడా కేటాయించలేదన్నారు. రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాల్లో 4శాతం లేని రెడ్డీలకు 6 స్థానాలు కేటాయించి, 50శాతం పైగా ఉన్న బీసీలకు 2 స్థానాలు, 12శాతం ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా లేకుండా చేయడం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ద్రోహం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో మల్లు, గడ్డం వివేక్ కుటుంబానికి ఉన్న విలువ.. మాదిగ జాతికి లేదని, అందుకు వారికి కేటాయించిన స్థానాలే సాక్ష్యమని అన్నారు. ఎంపీ స్థానాల్లో మాదిగలకు ఒక్కసీటు కూడా కల్పించని రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పది రోజులపాటు నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షులు పి.నర్సింహులు మాదిగ, బి.కృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రకాష్, ఎంఎస్ఎఫ్ జిల్లా కో-కన్వీనర్ ఉమాశంకర్, జిల్లా కార్యదర్శి మహేందర్, ఎంఎస్ఎఫ్ మండల కన్వీనర్ వెంకట్, ఎమ్మార్పీఎస్ తాండూరు మండలాధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షుడు పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలి

చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ▸ శంకర్‌పల్లి, చేవెళ్ల మండలాల్లో పర్యటన

చేవెళ్ల, ఏప్రిల్ 10 : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశ కీర్తి ప్రతిష్ఠలు గణనీయంగా పెరిగాయని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా బుధవారం శంకర్‌పల్లి మండలం లక్ష్మారెడ్డిగూడ, గాజులగూడ, ధోబిపేట్, అలంకాన్‌గూడ, ఫత్తేపూర్, బుల్కాపూర్, మోకిల, ప్రొద్దటూర్ గ్రామాల్లో పర్యటించారు. అలాగే సాయంత్రం చేవెళ్ల మండలం ఎన్కెపల్లి, ఆలూర్, మీర్జగూడ, బస్తేపూర్, చనువల్లి గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... యావత్ దేశం నరేంద్రమోదీ వెంటే నడుస్తోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభంజనాన్ని ఎదుర్కొకోలేకే కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కేరళ పారిపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. రైతులకు 2లక్షల రుణ మాఫీ చేయలేదని, వృద్ధులకు పింఛన్ పెంచడం లేదన్నారు. రైతులకు బోనస్ ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ పదేళ్లు పాలించి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు. తనను చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం పాటుపడతానన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడించి బీజేపీకి పట్టంకట్టాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ నర్సింలు, నాయకులు సురేశ్‌యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, రవి, జంగారెడ్డి, వెంకటేశ్, లక్ష్మారెడ్డి, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.


కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న గ్రామస్థులు


తాండూరులో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు

'స్ట్రాంగ్‌రూం' వద్ద భారీ బందోబస్తు

తాండూరు, ఏప్రిల్ 10: మే 13 నిర్వహించే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాండూరుకు వచ్చిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూం వద్ద పోలీసు పారామిలటరీ బృందంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈమేరకు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. బుధవారం తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ తారాసింగ్, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు.


సీఎంకి తమ సమస్య గురించి వివరిస్తున్న 2008 డీఎస్సీ అభ్యర్థులు

మాకు న్యాయం చేయండి సార్

▸ సీఎం రేవంత్‌కు 2008 డీఎస్సీ ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థుల విజ్ఞప్తి

వికారాబాద్/తాండూరు, ఏప్రిల్ 10 : 2008 డీఎస్సీలో అర్హత సాధించిన తమకు ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. 2008 డీఎస్సీలో అర్హత సాధించిన ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు బుధవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనకు వినతిపత్రం అందజేశారు. 2008 డీఎస్సీలో ప్రభుత్వ డీఎడ్ అభ్యర్థులకు అవకాశం కల్పించారని, తమకూ అవకాశం ఇవ్వాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈ డీఎస్సీలో ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో డీఎస్సీలో తమకు అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించామని చెప్పారు. న్యాయస్థానం ఉత్తర్వులతో తాము 2008 డీఎస్సీ పరీక్ష రాశామని, సెలెక్షన్ జాబితాలో, మెరిట్ జాబితాలో తమ పేర్లు ఉన్నాయని, ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కూడా జరిగిందని వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. న్యాయస్థానం ఆదేశాలతో డీఎస్సీ పరీక్ష రాసి ఎంపికైన ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా విత్‌హెల్డ్‌లో ఉంచి అప్పటి ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందన్నారు. న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా.. తాము ఉద్యోగాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని 2008 డీఎస్సీ అభ్యర్థులు సీఎంకు విజ్ఞప్తి చేశారు. సీఎంను కలిసిన వారిలో 2008 డీఎస్సీ అభ్యర్థులు రఘు, రాంప్రసాద్, కిషోర్, అశోక్, రవి, శ్రీనివాస్, కరుణాకర్, సునీత, అనంతలక్ష్మి, లత పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు పకడ్బందీ చర్యలు

▸ వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 10 : తాగునీటి సరఫరాకు అన్నిరకాల చర్యలు తీసుకున్నట్లు వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి తాగునీటి సరఫరాపై ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని, ప్రతీ గ్రామానికి తాగునీటి సరఫరా చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. వడదెబ్బ తగిలినవారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆశావర్కర్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ అమిత్, డీపీవో జయసుధ, డీఈవో రేణుకదేవి, డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణబాయి, డీఎంహెచ్‌వో పాల్వాన్ కుమార్, మిషన్ భగీరథ ఈఈలు బాబు శ్రీనివాస్, చల్మా రెడ్డి, డీఈలు తదితరులున్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బీఆర్ఎస్‌కు భారీ షాక్

200మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిక


కందుకూరు, ఏప్రిల్ 10: పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు భారీషాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన 200 మంది కార్యకర్తలు, నాయకులు జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) సమక్షంలో తుక్కుగూడలోని ఆయన చాంబర్‌లో కాంగ్రెస్‌లో చేరారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపునకు మనమంతా పనిచేయాలన్నారు. బాచుపల్లి, ధన్నారం, వావిళ్లకుంట తండా, బేగరికంచ గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలో కొత్త, పాత తేడా లేకుండా అందరినీ కలుపుకొని పోయి ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ టి.అనితాహరినాథ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యులు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, పీసీసీ కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణానాయక్, నాయకులు బుక్క ప్రశాంతిపాండురంగారెడ్డి, ఎం.శేఖర్‌రెడ్డి, సాయిలు, పాండుగౌడ్, హన్మంతరెడ్డి, ఢిల్లీ శ్రీధర్, కొలను విఘ్నేశ్వర్‌రెడ్డి, రూప్లానాయక్, పర్వతాలు, మట్ట మల్లయ్యగౌడ్, మంద నర్సింహ తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు

రామమందిరం నమూనాకు ప్రపంచస్థాయి గుర్తింపు

▸ ప్రెస్టీజియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో అశోక్‌కు చోటు

దౌల్తాబాద్, ఏప్రిల్ 10: కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్ మండలం యాంకి గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ సున్నపు అశోక్ చిత్రకళలో సిద్ధహస్తుడు. తన కళానైపుణ్యంతో మరో అరుదైన ఘనత సాధించాడు. ఇటీవల అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో 2000 ఐస్‌క్రీమ్ పుల్లలతో రోజుకు గంటపాటు శ్రమించి మొత్తం 20 రోజుల వ్యవధిలో రామమందిరం రూపకల్పన చేసి కళాభక్తిని చాటిన విషయం విదితమే. ఐస్‌క్రీమ్ పుల్లలు, సొప్ప బెండ్లు, టూత్ పుల్లలతో మనదేశంలో ప్రసిద్ధిగాంచిన పలు చారిత్రాత్మకమైన మందిరాలు, అద్భుత కట్టడాలను తయారు చేస్తూ ప్రతిభ చాటుతున్నాడు. ఈసందర్భంగా అశోక్ తయారుచేసిన రామమందిరంపై ప్రెస్టీజియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగిన ప్రెస్టీజియస్ వరల్డ్ రికార్డు సంస్థ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీ వారు వివిధ సామాజిక రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వ్యక్తులను గుర్తించి రికార్డులతో పట్టం కడతారు. ఈ నేపథ్యంలో అశోక్ తయారు చేసిన అయోధ్య రామమందిరం నమూనాపై వరల్డ్ రికార్డుగా పరిగణలోకి తీసుకొని ఫౌండర్ సీఈవో హర్షిత్ బాజ్‌పాయ్ ప్రెస్టీజియస్ వరల్డ్ రికార్డ్ ధ్రువీకరణ పత్రాన్ని ఆన్‌లైన్ వేదికగా అందించినట్లు అశోక్ తెలిపారు. అశోక్ ఈ ఘనత సాధించడంతో తల్లిదండ్రులు, బంధువులు, తోటి స్నేహితులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


చిత్రకారుడు అశోక్ తయారు చేసిన రామమందిరం నమూనా


కొమరబండలో ధ్వజారోహణంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం

షాబాద్, ఏప్రిల్ 10 : మండల పరిధి కొమరబండలో శ్రీబుగ్గరామేశ్వరస్వామి ధ్వజారోహణం, రుద్రాభిషేకం బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. కొమరబండ నుంచి బుగ్గరామేశ్వరస్వామి ఆలయం వరకు భక్తులు భజనలు, కోలాటాలతో ఆలయానికి చేరుకొని ధ్వజారోహణం నిర్వహించారు. వారం రోజులు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు.

వేర్వేరు పాఠశాలల్లో ముగ్గురు విద్యార్థినులకు అస్వస్థత

▸ ఆస్పత్రిలో చేరిక..

▸ హాస్టల్‌లో భోజనం సరిగా లేదని తల్లిదండ్రుల ఆరోపణ

తాండూరు రూరల్, ఏప్రిల్ 10 : వేర్వేరు పాఠశాలల్లో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారికి వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తాండూరు మండలం చెన్‌గేష్‌పూర్ మార్గంలోని జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో సుమిత్ర, మౌనికలు ఐదో తరగతి చదువుకుంటూ వసతి గృహంలో ఉంటున్నారు. బుధవారం రాత్రి వారికి కడుపునొప్పి రావడంతో ఇద్దరినీ తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మౌనికను కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా, వసతి గృహంలో సరైన సౌకర్యాలు లేక బాలికలు ఇబ్బందులు పడుతున్నారని, నాణ్యతలేని భోజనం, కలుషిత నీటివల్ల అనారోగ్యం పాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. హాస్టల్‌లో తగిన సౌకర్యాలు లేక ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని విద్యార్థులు తెలిపారు.


తాండూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

మరో సంఘటనలో..

తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన అలేఖ్య జినుగుర్తి గేటు సమీపంలోని కేజీబీవీలో 6వ తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. నాలుగు రోజులుగా అలేఖ్య కడుపునొప్పితో బాధపడుతోంది. ప్రైవేటు ఆసుపత్రితోపాటు జిల్లా ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించారు. కాగా, అలేఖ్య రక్తహీనతతో బాధపడుతోందని, మెరుగైన వైద్యం కోసం నీలోఫర్‌కు వైద్యులు రెఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేజీబీవీలో నాణ్యత లేని భోజనం, కలుషిత వాతావరణం వల్ల బాలికలు తీవ్ర అస్వస్థతకు గురైనట్లు తల్లిదండ్రులు తెలిపారు. కేజీబీవీ సమీపంలో జిప్సం ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసనతో వారం రోజుల క్రితం పలువురు విద్యార్థినులు దగ్గు, దమ్ముతో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురై హాస్టల్ నుంచి ఇంటికి వెళ్లిపోయిన సంఘటనలున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ ఉన్నతాధికారులు హాస్టళ్లను తనిఖీ చేయకపోవడంతో స్థానికంగా ఉన్న అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

కాంగ్రెస్ విజయం కోసం కృషి చేయాలి

ఎంపీ రంజిత్‌రెడ్డి ● కాంగ్రెస్ పార్టీలో మాజీ సర్పంచ్‌ల చేరిక


రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మాజీ సర్పంచ్‌లు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 10 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతీ ఒక్క కార్యకర్త కృషిచేయాలని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేందర్ ఆధ్వర్యంలో మల్కారం మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, మాధవియాదగిరిరెడ్డి, విండో మాజీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జంగయ్య, మరో 200మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు అనంతరం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలంటే ప్రతీ కార్యకర్త కృషిచేయాలని కోరారు. మన రాష్ట్రం, ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఢిల్లీలో మన వాణి విన్పించేందుకు చేవెళ్ల ఎంపీ స్థానంలో కాంగ్రెస్ విజయం సాధించాలన్నారు. గతంలో ఎంపీగా ఉన్నపుడు వందల కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహేందర్, కోటేశ్వర్‌గౌడ్, జీవన్‌గౌడ్, ఫకృద్దీన్, రఫీక్, సిద్దేశ్వర్, చంద్రశేఖర్, సురేష్, జిల్లా అనంద్, ప్రభాకర్, ఆంజనేయులు, మల్లికార్జున్ పాల్గొన్నారు

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఆరు గ్యారంటీలు పక్కా

శంషాబాద్ రూరల్: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే అర్హులైన ప్రతి కుటుంబానికి ఆరు గ్యారంటీ పథకాలు పక్కాగా అందేలా తాము చర్యలు తీసుకుంటామని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ బోర్డు సభ్యురాలు సీతారెడ్డి అన్నారు. ఆమె శంషాబాద్ మండలం నర్కూడ, చౌదరిగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు నర్కూడలో గల శ్రీసీతారామస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి తన భర్త రంజిత్‌రెడ్డిని ఎంపీగా మరోసారి గెలిపించాలని కోరారు. ప్రగతి కోసం పాటుపడే వ్యక్తి రంజిత్‌రెడ్డి అన్నారు. ప్రచారం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మహాలక్ష్మి పథకం కింద ప్రతి పేద కుటుంబంలో మహిళలకు నెలనెలా రూ.2,500 ఇచ్చి ఆదుకుంటామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నామని, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా, చేయూత, యువ వికాస్ పథకాలతో పేదలకు లబ్ధి కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేక విపక్షాలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఆమె వెంట రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, ఎంపీటీసీ గౌతమి తదితరులు ఉన్నారు.


నర్కూడలో ఓటర్లకు నమస్కరిస్తున్న రంజిత్‌రెడ్డి సతీమణి సీత

రంజిత్‌రెడ్డిని ఆశీర్వదించి ఆదరించండి

చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీత

మహేశ్వరం, ఏప్రిల్ 10 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి అయిన తన భర్త రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రంజిత్‌రెడ్డి సతీమణి సీత ప్రజలను కోరారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ 15వ వార్డులో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించిన ఆమె ఓటర్లకు తమ గుర్తును చూపిస్తూ ఓట్లు అభ్యర్థించారు. తన భర్త గత ఐదేళ్లుగా ఎంపీగా ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి, సంక్షేమాలపై వివరించారు. ఈ సారి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయం అన్నారు. మరో సారి రంజిత్‌రెడ్డిని ఆశీర్వదించి చేతి గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో పీసీసీ కార్యదర్శి గోగికార్ జానకిరామ్, తుక్కుగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ తేజశ్విని శ్రీకాంత్, మాజీ సర్పంచ్ దేవరాయసుధాకర్, రాజేందర్, పద్మబాస్కర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమత, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


తుక్కుగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీత

రంజాన్ వేడుకలకు ఈద్గాలు ముస్తాబు


వికారాబాద్ : ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న చిగుళ్లపల్లి రమేష్‌కుమార్


పరిగి : సుల్తాన్‌నగర్‌లోని అబ్బాస్‌అలీ ఈద్గాను ముస్తాబు చేసిన నిర్వాహకులు

● ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

పరిగి, ఏప్రిల్ 10: రంజాన్‌ను పురస్కరించుకొని మసీదుల వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరిగి మునిసిపల్ పరిధిలోని అన్ని మసీదులు, ఈద్గాల వద్ద ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరిగిలోని మెయిన్ ఈద్గా వద్ద మునిసిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. సుల్తాన్‌నగర్‌లోని అబ్బాస్‌అలీ ఈద్గాలో ఈదుల్ ఫితర్ నమాజ్ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈద్గా కమిటీ అధ్యక్షుడు ఇలియాస్, నాయకులు గౌస్‌పాషాలు తెలిపారు. ప్రార్థనలు చేసేందుకు మసీదులు, ఈద్గాల వద్ద పరిసరాలు శుభ్రం చేయడంతోపాటు, టెంట్లు వేసి తదితర అన్ని ఏర్పాట్లు చేశారు.

కులకచర్ల : రంజాన్ వేడుకలకు కులకచర్ల మండలంలోని వివిధ గ్రామాల్లో మసీద్‌లు, ఈద్గాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు. గురువారం రంజాన్ పర్వదినం కావడంతో ముస్లింలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ముజాహిద్‌పూర్, బండవెల్కిచర్ల, కులకచర్ల, చౌడాపూర్, బొంరెడ్డిపల్లి గ్రామాల్లోని మసీద్‌లు, ఈద్గాలను ముస్తాబు చేశారు.

వికారాబాద్ : వికారాబాద్ మున్సిపల్, పట్టణ ప్రాంతంలో నేడు నిర్వహించే రంజాన్ వేడుకలను పురస్కరించుకొని మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో దర్గాలు, ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని వికారాబాద్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో స్థానిక నాయకులు, ముస్లిం నాయకులతో కలిసి దర్గాలు, ఈద్గాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాజీ జడ్పీటీసీ ముత్తహర్ షరీఫ్, కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు సర్ఫరాజ్, హసీబ్, షరీఫ్, సురేష్‌గౌడ్, ఆనంద్, కాజా, ఖలీద్, కలీం, ఉస్మాన్, రుక్కుమ్, నిజాం, కేదార్, షఫీ తదితరులు పాల్గొన్నారు.


మోమిన్‌పేట : టేకులపల్లిలో ముస్తాబైన మసీదు

తాండూరు : రంజాన్‌ను పురస్కరించుకొని బుధవారం జిల్లా ఎస్పీ కోటి రెడ్డి, తాండూరులోని ఈద్గా కమిటీ ప్రతినిధులతో కలిసి బందోబస్తును పరిశీలించారు. నేడు(గురువారం) రంజాన్ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, శాంతి భద్రతల సమస్య రాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐలు అశోక్ కుమార్, సంతోష్ కుమార్, తదితరులు ఉన్నారు.

మోమిన్‌పేట్/బొంరాస్‌పేట్ : ముస్లింలు నెల రోజుల పాటు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేపట్టారు. ఉపవాస దీక్షలు బుధవారంతో ముగియడంతో గురువారం రంజాన్‌ను జరుపుకోనున్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మసీద్‌లు, ఈద్గాలను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని మసీద్, ఈద్గాను ముస్తాబు చేశారు.

ఘట్‌కేసర్ : రంజాన్ సందర్భంగా ఈద్గాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డిగూడలోని ఈద్గాను, పోచారం మున్సిపాలిటీలోని నారపల్లిలోగల ఈద్గాను, చౌదరిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఓయూ కాలనీలో గల ఈద్గాలను ముస్తాబు చేశారు. ఘట్‌కేసర్ నారపల్లిలోని ఈద్గాలో తెల్లటి షామియానా ఏర్పాటు చేశారు. అలాగే మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.


మేడ్చల్ పట్టణంలోని ఈద్గా వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లు


తాండూరులోని ఈద్గాను పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి, తదితరులు

పోలెపల్లిలో ఇఫ్తార్ విందు



మోమిన్‌పేట్ : మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పుర్ర పెంటయ్యయాదవ్ అన్నారు. దుద్యాల మండలంలోని పోలెపల్లిలో రంజాన్ ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మునావర్, జహంగీర్, కరీం, యూసుఫ్, జలీల్, ముస్తాక్, అఫ్రోజ్, రమేశ్‌గౌడ్, రాఘవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి



కులకచర్ల, ఏప్రిల్ 10: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కులకచర్ల గ్రామంలో మార్చి 21న గుర్తు తెలియని వృద్ధుడు(75) బీపీ అధికమై కింద పడిపోయాడు. స్థానికులు ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం కోసం తాండూర్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు. మృతుడి ఒంటిపై ఎరుపు కలర్ టీ షర్ట్, నలుపు కలర్ షార్ట్ ఉందని, ప్రస్తుతం మృతదేహం తాండూరు ప్రభుత్వాసుపత్రిలో ఉందని తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే కులకచర్ల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి..

కులకచర్ల, ఏప్రిల్ 10: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కులకచర్ల మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని గండి తిరుమలాపూర్‌నకు చెందిన (ఇప్పాయిపల్లి గేటు) పసుల మహేశ్(32) చౌడాపూర్‌లో పర్మిట్‌రూం నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి చౌడాపూర్ నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా.. మండలంలోని గండిచెరువు ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో కింద పడిపోయాడు. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అన్వేశ్‌రెడ్డి తెలిపారు.

20 ట్రాక్టర్ల ఇసుక సీజ్

● రూ.40వేల జరిమానా

బషీరాబాద్, ఏప్రిల్ 10: ఓ ఫామ్‌హౌస్‌లో అక్రమంగా నిల్వచేసిన దాదాపు 20 ట్రాక్టర్ల ఇసుకను బషీరాబాద్ రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్ చేశారు. మండల పరిధిలోని ఎక్మాయి శివారు ప్రధాన రోడ్డు మార్గం పక్కన గల ఓ ఫామ్‌హౌస్‌లో భారీగా ఇసుక నిల్వ చేసినట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. తహసీల్దార్ వై.వెంకటేష్, ఆర్ఐ రాకేష్ సిబ్బందితో కలిసి ఫామ్‌హౌస్‌ను సందర్శించగా ఇసుక నిల్వలు గుర్తించారు. నిర్వాహకులతో ఇసుక నిల్వపై తహసీల్దార్ ఆరా తీయగా.. పొలం పక్కన వాగులోంచి తీసుకొచ్చినట్లు చెప్పుకొచ్చారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించడం పట్ల నిర్వాహకులపై తహసీల్దార్ సీరియస్ అయ్యారు. ఇందుకు అక్కడి నిర్వాహకులు నోరు మెదపకుండా ఉండిపోవడంతో రూ.40 వేల జరిమానా కట్టాలని తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. నిర్ణీత జరిమానా చెల్లించేవరకు ఇసుకను ముట్టుకోవద్దని హెచ్చరిస్తూ తహసీల్దార్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా, ఇప్పటికే ఫామ్‌హౌస్‌లో పెద్ద నీటితొట్టి నిర్మాణంతో పాటు, పలు రకాల నిర్మాణాలు పూర్తిచేశారని, ఇసుక ఎక్కడి నుంచి తరలించారో అధికారులు తేల్చాలని స్థానిక రైతులు ప్రశ్నిస్తున్నారు. పేద ప్రజలు ఇంటి నిర్మాణానికి ఇసుక కోసం రెవెన్యూ కార్యాలయానికి వస్తే మాత్రం అధికారులు సకాలంలో అనుమతివ్వరని పలువురు మండిపడుతున్నారు. ఫామ్‌హౌస్‌లో జరిగిన పలు నిర్మాణాలకు పొలం పక్కన వాగులోంచి పగాలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను తీసుకొచ్చినట్లు వారు ఆరోపిస్తున్నారు. వారంరోజుల కిందట ఎక్మాయి ప్రాంత నాపరాళ్ల గనుల నుంచి ట్రాక్టర్ల ద్వారా కూడా వందలాది ట్రిప్పుల రాళ్ల ముక్కలను ఫామ్‌హౌస్‌కు తరలించినట్లు ఎక్మాయి గ్రామస్తులు పలువురు తెలిపారు. ఇదేమని అడిగితే ఓ ఉన్నతాధికారి పేరు చెబుతూ నిరాటంకంగా తరలించారని జోరుగా చర్చించుకుంటున్నారు.

గడువు ముగిసిన తినుబండారాల విక్రయం.. వ్యక్తిపై కేసు

మోమిన్‌పేట్, ఏప్రిల్ 10: గడువు ముగిసిన తినుబండారాలు అమ్ముతున్న దుకాణదారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అరవింద్ తెలిపారు. బుధవారం పక్కా సమాచారం మేరకు మోమిన్‌పేట్ అంజయ్య కిరాణ దుకాణంలో గడువు ముగిసిన బిస్కెట్ ప్యాకెట్లు, నూడుల్స్ చిప్స్ ప్యాకెట్లు అమ్ముతున్నారని దాడులు నిర్వహించి కేసు నమోదు చేశారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో దుకాణదారులు గడువు ముగిసిన వస్తువులను అమ్మరాదని హెచ్చరించారు. దుకాణదారుడు అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


స్వాధీనం చేసుకున్న తినుబండారాలు, నిందితుడు అంజయ్య

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి


శ్రీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు, ఏప్రిల్ 10: బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడిగా ఎబ్బనూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డిని నియమించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో బుధవారం వికారాబాద్‌లో జరిగిన సమావేశంలో శ్రీకాంత్ రెడ్డిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం ఆనంద్ ఆయనకు శాలువ కప్పి సన్మానించి అభినందించారు. పార్టీ మండలాధ్యక్ష పదవికి రాజునాయక్ రాజీనామా చేయటంతో ఆయన స్థానంలో శ్రీకాంత్‌రెడ్డిని నియమించారు. ధారూరు పీఎసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రమౌళి, హఫీజ్, రాజేందర్‌రెడ్డి, అంజయ్య, రాజుగుప్త, వెంకటయ్య, కె.అంజయ్య, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

మర్పల్లి, ఏప్రిల్ 10: కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్ అన్నారు. మర్పల్లి మండలంలోని నర్సాపూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు అశోక్ అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారంలో లేకపోయినా.. ప్రతీ కార్యకర్తను కాపాడుకోవడం జరిగిందని తెలిపారు. అధికారంలోకి వచ్చాక కూడా ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, బసంతం, జావీద్, ఉప్పరి రమేశ్, అబ్దుల్ నబీ తదితరులున్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న రవీందర్

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

కులకచర్ల, ఏప్రిల్ 10: మండలంలోని ఘణాపూర్ గ్రామంలో ఉగాదిని పురస్కరించుకొని మంగళవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లో గోపినాయక్ తండా జట్టు గెలుపొంది మొదటి బహుమతి అందుకుంది. శుభనాయక్ తండా జట్టు రెండో బహుమతి అందుకుంది. ముఖ్యఅతిథిగా పరిగి బీజేపీ నాయకులు వార్ల ఆంజనేయులు, పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్‌లు పాల్గొని బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శేఖర్, అరుణ్, నవీన్, శివ, మణికంఠ, వెంకటయ్యగౌడ్, విజయ్‌గౌడ్, విజయ్‌కుమార్, రామచంద్రయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులతో క్రీడాకారులు

సంక్షిప్తంగా..

● **వికారాబాద్ :** నవాబుపేట మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా అజయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్నేహితులు ఎంపీడీవో కార్యాలయంలో పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అక్నాపూర్ బుచ్చయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు యేసుదాస్, ఉపాధ్యాయులు వెంకట్, అనంతయ్య, బాలయ్య, హరి, వీరయ్య తదితరులన్నారు.

● **దోమ :** మండలంలోని ఖమ్మం నాచారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మాజీ పట్వారీ స్వర్గీయ దొరశెట్టి చంద్రశేఖర్ ప్రథమ వర్థంతిని పురస్కరించుకొని ఆయన జ్ఞాపకార్థంగా తనయులు భీమలింగం, శ్రీశైలం, శాంత్‌కుమార్, సత్యమూర్తి ఉపాధ్యాయుల సమక్షంలో 30 మందికి పంపిణీ చేశారు.

● **బషీరాబాద్ :** మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో సూర్యప్రకాశ్ తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. అనంతరం స్టాక్ రిజిష్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్, ఏప్రిల్ 10: వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో చేతి పంపులను పరిశీలించి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు మునీర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ దాము, మురారి వశిష్ఠ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


చేతి పంపులకు మరమ్మతులు చేయాలని సూచిస్తున్న జగదీశ్వర్

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం


మోమిన్‌పేట్ : చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

మోమిన్‌పేట్/కులకచర్ల, ఏప్రిల్ 10: చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు మోమిన్‌పేట్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నర్సిములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆర్ఐ రాజు, పంచాయతీ కార్యదర్శి నర్సిములు, ఏఈవో పెంటయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కులకచర్ల మండలంలోని అంతారం గ్రామ చౌరస్తాలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన విఠల్ కొండలయ్య మృతిచెందగా కుటుంబ సభ్యులు బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

సూర్యనారాయణమూర్తిగా వేంకటేశ్వరస్వామి

● సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన బాలాజీ

కొడంగల్, ఏప్రిల్ 10: కొడంగల్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ 44వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేంకటేశ్వరస్వామి భక్తులకు సూర్యనారాయణమూర్తిగా దర్శనం ఇచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు ఉదయం సూర్యప్రభవాహనంపై శ్రీవారు సూర్యనారాయణమూర్తిగా ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు, ధర్మకర్తలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారికి పూజలు చేశారు.


సూర్యనారాయణమూర్తిగా దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి

వంద రోజుల్లోనే కాంగ్రెస్‌పై వ్యతిరేకత

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన 100 రోజుల్లోనే ప్రజల నుంచి ఎంతో వ్యతిరేకత మూటకట్టుకుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, లోక్‌సభ ఎన్నికల జిల్లా కోఆర్డినేటర్ పి. కార్తీక్‌రెడ్డి తెలిపారు. బుధవారం వికారాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13న చేవెళ్ల సమీపంలో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నేతృత్వంలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నామన్నారు. సభకు ప్రజలు లక్షలాదిగా వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ప్రజలు పాత ప్రభుత్వమే ఉంటే బాగుండేదన్న ఆలోచనకు వచ్చారన్నారు. ప్రజలు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ యంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీ గెలిపించి కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెబుతామన్నారు. రంజిత్‌రెడ్డి అవకాశం, స్వార్థం కోసం పార్టీ మారారని, ఆయనకు ప్రజలే ఎన్నికల్లో గట్టిగ బుద్ధి చెబుతారన్నారు. పార్లమెంట్ ఎన్నికలు కాంగ్రెస్‌కు రెఫరెండం లాంటివన్నారు. లోక్‌సభలో మా అభ్యర్థుల్ని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీ పూర్తి చేయలేదని, రూ.500 గ్యాస్, ఉచిత కరెంట్, రైతుబంధు ఇప్పటివరకు ఎంతమందికి ఇచ్చారని చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో చేసిన వ్యాఖ్యలతోనే తాను బలహీనంగా ఉన్నాడని చెప్పకనే చెబుతున్నట్లుందన్నారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలు రాజకీయంగా ఎవరికీ తెలియదని, కేసీఆర్ బొమ్మ మీదనే గెలిచారన్నారు. మా అభ్యర్థి బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ సభకు నాయకులు, ప్రజలు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి దిగ్విజయం చేయాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు అనంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గోపాల్ తదితరులున్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 10 : మండల పరిధి కాచవాని సింగారంలో నీటి సమస్య పరిష్కారానికి కృషిచేయనున్నట్లు జిల్లా సీఈవో దిలీప్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఎంపీడీవో, జలమండలి అధికారులతో కలిసి కాచవానిసింగారంలోని పలు కాలనీల్లో పర్యటించి నీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గీతారెడ్డి, డీపీవో వెంకటయ్య, జలమండలి అధికారులు, కార్యదర్శి మల్లారెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న దిలీప్‌కుమార్

అంబలి కేంద్రం ప్రారంభం

కొడంగల్, ఏప్రిల్ 10: మండలంలోని అంగడిరైచూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోడల రాంరెడ్డి బుధవారం అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ ఏడాది వేసవిలో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలి

● అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య


మాట్లాడుతున్న అభిషేక్ అగస్త్య

మేడ్చల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ఎండలో పని చేసే వారు వడదెబ్బకు గురికాకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మానవ ఆరోగ్యంపై వాతావరణం మార్పు అనే అంశంపై ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశానికి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ రఘునాధస్వామితో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు, నేరుగా సూర్యకిరణాలు తాకే స్థలాల్లో పనిచేసే వారు వడదెబ్బకు గురికాకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వైద్య, విద్య, డిజాస్టర్ మేనేజిమెంట్ అథారిటీ, వ్యవసాయ పశుసంవర్ధక, పబ్లిక్ వర్క్స్, పర్యావరణ, కాలుష్య నివారణ, మున్సిపల్ కమిషనర్ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కూడళ్ల వద్ద, పార్కుల వంటి స్థలాల్లో చలివేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మూగజీవులు, పశువులకు నీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం వడదెబ్బ నుంచి రక్షించుకుందాం అనే పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాంబశివరావు, డీఏవో రేఖ, డీజీడబ్ల్యూవో రేవతి, డీడబ్ల్యూవో కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు తదితరులున్నారు.

పాంబండ ఆలయం హుండీ లెక్కింపు

● రూ.5లక్షల 82వేల ఆదాయం

కులకచర్ల, ఏప్రిల్ 10: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ ఏకశిల పర్వతం పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి హుండీని బుధవారం లెక్కించారు. 11 రోజులుగా జాతర నిర్వహించారు. పాంబండ దేవాలయానికి ఆదాయం రూ.5లక్షల 82వేల 701, మొక్కుబడిగా వచ్చిన రెండు కోడెలను విక్రయించగా.. రూ. 36,500 ఆదాయం వచ్చింది. ఆలయ చైర్మన్ నర్సమ్మ రాములు, ఈవో సుధాకర్, అర్చకులు దశరథం, పాండు శర్మ, శ్రీ సాంబశివాని సేవా సంస్థ భక్తులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ యువదళ్ నూతన కార్యవర్గం

తాండూరు, ఏప్రిల్ 10: వీరశైవ యువదళ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం తాండూరులో పెద్దల సమక్షంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మటం జగదీశ్వర్‌స్వామి, అధ్యక్షులుగా అడికి శశాంక్, ఉపాధ్యక్షులుగా రవి కుమార్, శివప్రసాద్, పరమేష్, ప్రధాన కార్యదర్శిగా చంద్రకాంత్, కోశాధికారిగా కిరణ్‌కుమార్, సహ కార్యదర్శులుగా ఫణికుమార్, దినేష్, నాగేంద్రప్పలను ఎన్నుకున్నారు.

